# ఒక్క తప్పు చేస్తే యాభై ఏళ్లు వెనక్కి



మంత్రి గంగులకు పూల దండ వేసి సత్కరిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు, మహిళలు

- గతంలో తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్సే
- నెల రోజులు పని చేయండి.. ఐదేళ్లు మీ కోసం సేవ చేస్తా
- వలసల నుంచి ఉపాధినిచ్చే రాష్ట్రంగా మారిన తెలంగాణ
- అన్ని కుల సంఘాలు మద్దతు తెలుపడం జీవితంలో మరిచిపోలేను
- మంత్రి, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 1 : ఈ ఎన్నికల్లో ఒక్క తప్పు చేస్తే మళ్లీ యాభై ఏళ్లు వెనక్కి వెళ్తామని, ఆలోచించి అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలని మంత్రి, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ సూచించారు. బుధవారం ఉదయం కొత్తపల్లి పట్టణంలో నిర్వహించిన అన్ని కుల సంఘాల ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. కొత్తపల్లి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్ని కుల సంఘాలకు చెందిన వ్యక్తులు తనకు మద్దతు ప్రకటించడం జీవితంలో మరిచిపోలేనిదని, మీ అభిమానానికి శిరసు వంచి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కసారి గెలిచిన అభ్యర్థి రెండోసారి గెలిచిన చరిత్ర ఇక్కడ లేదని, తనపై అభిమానం, తాను చేసిన అభివృద్ధి పనులతో కరీంనగర్ ప్రజలు వరుసగా రెండోసారి, మూడోసారి విజయం అందించి అక్కున చేర్చుకున్నారని, వారి ఆదరాభిమానులు జీవితంలో మరిచిపోనన్నారు. మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డితో పాటు ఆంధ్రా నాయకులు షర్మిల, పవన్‌కల్యాణ్, తదితరులు హైదరాబాద్‌లో మకాం వేసి తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలిపే కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనకే కర్ణాటకలో ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. ఢిల్లీలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని చెప్పారు. ఒక్క నెల తన కోసం కష్టపడితే ఐదేళ్లు మీకోసం సేవ చేస్తానని హామీ ఇచ్చారు. తనపై పోటీ చేసిన నాయకులు ఎన్నికలప్పుడు మాత్రమే కనిపిస్తారని, ఇప్పుడు సైతం ఇదే జరుగుతుందన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. భూ కబ్జాదారులకు కాంగ్రెస్ టిక్కెట్లు ఇస్తున్నదని, దీనిని ప్రజలంతా గుర్తించాలని కోరారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఒక్క రూపాయి నిధులు తేలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు కొత్తపల్లి పట్టణం ఎలా ఉండేదో రాష్ట్రం వచ్చాక ఎంత అభివృద్ధి జరిగిందో గమనించాలన్నారు. కరీంనగర్ పక్కనే ఉన్న కొత్తపల్లిని గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని, తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచే కొత్తపల్లి అభివృద్ధిని పూర్తి స్థాయిలో చేశానన్నారు. ఇప్పుడు పట్టణంలో వీధి వీధికీ సీసీ రోడ్లు, ఇంటింటికీ సురక్షితమైన మంచి నీరు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్‌తో సెంట్రల్ లైటింగ్ పనులు నిలిచిపోయాయని, ఎన్నికల ముగిసిన అనంతరం ప్రారంభమవుతాయన్నారు. సమైక్య పాలకుల దోపిడీతో తెలంగాణ రాష్ట్రం వలసలకు కేంద్రంగా మారితే సీఎం కేసీఆర్ పాలనతో ఇతర రాష్ట్రాల వారికి తెలంగాణ ఉపాధి కేంద్రంగా మారడం గర్వంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నా.. మంత్రిగా ఉన్నా ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండి అభివృద్ధి చేయడంతోనే తనకు మద్దతు లభిస్తుందన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయ మాటలకు మోసపోవద్దన్నారు. అమలు కానీ హామీలిచ్చి కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయలేక చేతులేత్తేసిందన్నారు. తనను మళ్లీ గెలిపిస్తే కొత్తపల్లి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 25 కుల సంఘాలకు చెందిన నాయకులు మంత్రి గంగులకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, బండ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పలు కుల సంఘాల నాయకులు, రైతు సమన్వయ సమితి నాయకులు, పట్టణవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కొత్తపల్లి : మంత్రి గంగులకు మద్దతుగా భారీగా తరలివచ్చిన పలు కుల సంఘాల నాయకులు

# కాపాడే కేసీఆరా.. సున్నం పెట్టే కాంగ్రెస్సా.. మీరే ఆలోచించండి



రంగరావుపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌ను సన్మానిస్తున్న మహిళలు, నాయకులు

- కాంగ్రెస్, బీజేపీని నమ్మితే అరిగోసే
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గంగాధర మండలంలో ఇంటింటా ప్రచారం
- ఘన స్వాగతం పలికిన మహిళలు, గ్రామస్తులు

గంగాధర, నవంబర్ 1 : తెలంగాణ ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకునే కేసీఆర్ కావాలో..? అబద్ధపు హామీలతో సున్నం పెట్టే కాంగ్రెస్ కాంగ్రెస్, బీజేపీలో కావాలో..? ప్రజలారా మీరే ఆలోచించాలని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే కర్ణాటక రైతుల మాదిరిగా అరిగోస పడుతామని, అర్ధరాత్రి సమయంలో పొలం కాడికి పోవడానికి టార్చిలైట్లు కొనుక్కోవాల్సిన దుస్థితి వస్తుందన్నారు. రైతు బంధు వద్దని, మూడు గంటల కరెంట్ చాలని చెప్పే కాంగ్రెస్‌తో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సీఎం కేసీఆర్‌ను మరచిపోవద్దని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. గంగాధర మండలంలోని తాడిజెర్రి, రంగరావుపల్లి, గోపాల్‌రావుపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ర్యాలీ తీసి గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు, సర్పంచులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించి ఘన స్వాగతం పలికారు. ఆయాచోట్ల సుంకె రవిశంకర్ మాట్లాడారు. కాంగ్రెస్‌ది కుర్చీలాట అని, బీజేపీది మత రాజకీయమని, బీఆర్ఎస్‌ది ప్రజా సంక్షేమమని పేర్కొన్నారు. ₹1800 కోట్లతో చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, పల్లెలను మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ జోరుకు ప్రతిపక్షాలు బేజారవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఐదు గ్యారెంటీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా చేతులెత్తేసిందని విమర్శించారు. కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధును బంద్ చేయాలని ఈసీకి లేఖ రాశాడని దుయ్యబట్టారు. 'జన్‌ధన్ ఖాతా కోలో.. హమ్ ధన్‌ధన్ పంద్రా లాక్ దాలేంగే' అన్న ప్రధాని మోదీ 15 పైసలు కూడా జమచేయలేదని ఎద్దేవా చేశారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో వచ్చి అబద్ధపు ప్రచారాలు చేసే వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధానర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పుల్కం గంగన్న, వైస్ ఎంపీపీ కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు రామిడి కనకమ్మ, పాశం స్వప్నకుమార్, రాసూరి మల్లేశం, ఆకుల శంకరయ్య, కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, ఎంపీటీసీలు ద్యావ మధుసూదన్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, నాయకులు ఆకుల మధుసూదన్, రామిడి సురేందర్, రేండ్ల శ్రీనివాస్, అలువాల తిరుపతి, తడిగొప్పుల రమేశ్, ఎండీ అబ్బాస్, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మనవేని ప్రభాకర్, ఇరుగురాల రవి, గంగాధర శ్రీకాంత్, మ్యాకల కరుణాకర్, గుంటుకు ఆంజనేయులు, శనిగరపు వెంకటేశ్, అస్తపురం వెంకటేశ్, ఉప్పు ప్రశాంత్, రాసూరి సంజీవ్, కోల అనిల్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నరుపుపల్లిలో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# మళ్లీ విజయం మనదే

- రాబోయే ఐదేండ్లు మీ కోసం మరింత సేవ చేస్తా
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- ఎన్నరుపుపల్లిలో ఎఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట, నవంబర్ 1: 'తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ హయాంలోనే ఎనలేని అభివృద్ధి జరిగింది. మళ్లీ విజయం మనదే. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తం' అని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ 30 రోజులు తన కోసం పని చేయాలని, రాబోయే ఐదేండ్లు మీ కోసం మరింత చేస్తానని విజ్ఞప్తి చేశారు. ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్నరుసుపల్లి గ్రామానికి చెందిన ఇతర పార్టీల నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారికి రసమయి వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఎన్నరుసుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న సమయంలో ఇతర పార్టీల నాయకులు గూలాబీ గూటికి చేరుకోవడం సంతోషకరమన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని, తనను మరోసారి గెలిపించాలని కోరారు. తొమ్మిదిన్నర ఏండ్లల్లో ఎంతో అభివృద్ధి చేశానని.. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీఇచ్చారు. తర్వాత రంగంపేట జీపీ పరిధిలోని మ్యాకోనిపల్లిలో ఓ శుభకార్యానికి హాజరై గ్రామస్తులను ఆప్యాయంగా పలుకరించారు. మరోసారి నువ్వే ఎమ్మెల్యే అవుతావంటూ.. ఓ వృద్ధురాలి దీవించగా రసమయి ఆపాయ్యంగా అక్కున చేర్చుకొని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# కలెక్టర్ క్యాంపు ఆఫీస్‌లో చోరీ

- బదిలీపై వెళ్లిన కలెక్టర్ గోపి సామగ్రి అపహరణ
- ల్యాప్‌టాప్, డిజిటల్ కీ, పెన్‌డ్రైవ్, ఒక బ్యాగు చోరీ

రాంనగర్, నవంబర్ 1 : కరీంనగర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. క్యాంపు కార్యాలయం వెనుక నుంచి లోనికి ప్రవేశించిన దుండగుడు బదిలీపై వెళ్లిన కలెక్టర్ గోపి గదిలోని ల్యాప్‌టాప్, డిజిటల్ కీ, పెన్‌డ్రైవ్, ఒక బ్యాగును అపహరించినట్లు క్యాంపు కార్యాలయం సూపరిండెంటెంట్ రాంమోహన్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడు రోజుల క్రితం కలెక్టర్, సీపీ బదిలీ కాగా వారి స్థానంలో కొత్తవారు బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన కలెక్టర్ గోపి విధుల నుంచి రిలీవ్ అయి వెళ్లేందుకు ఉన్న సామానంతా ప్యాక్ చేసుకుని ఓ గదిలో భద్రపరిచారు. తెల్లారే సరికి గది తలుపులు తెరిచి ఉండడం, ల్యాప్‌టాప్ కన్పించకపోవడంతో భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. భద్రతా సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఘటనా స్థలంలో దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా ఒక దుండగుడులోనికి ప్రవేశించినట్లు ఆనవాళ్లు లభించడంతో దర్యాప్తు ప్రారంభించారు. సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నామని వన్‌టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు.



నిందితుడి సీసీ కెమెరా చిత్రం